క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

కామవరపుకోట : తడికలపూడి గ్రామంలో నాగుల చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం జెడ్పీటీసీ కడిమి రమేష్ పరిశీలించారు. హాజరు పట్టీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనాలలో అవకతవకలు లేకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా పనులు జరిగే ప్రదేశంలో అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ కొప్పర్తి లక్ష్ముడు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెంరూరల్ : చక్రదేవరపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేపట్టారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న ఎస్సై దుర్గా మహేశ్వరరావు తన సిబ్బందితో దాడులు నిర్వహించి 8 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.17,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

న్యూడెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవం

బుట్టాయగూడెం : నిత్యవసర సరుకుల ధరలను తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ధర్మల సురేష్ అన్నారు. ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుట్టాయగూడెంలోని రామనర్సయ్య భవనం వద్ద ఆ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశభక్తి ముసుగులో దేశ సంపదను అమ్మేసుకుంటున్నారని, దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్న కేంద్ర విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కారం రాఘవ, జి.పండు, చింతల కృష్ణ, కేవీ రమణ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో భోజన వసతి

కొయ్యలగూడెం : కొయ్యలగూడేనికి చెందిన యువజన నాయకులు పలుచోట్ల నిర్వహిస్తున్న శరణాలయాలలో మంగళవారం భోజన వసతి కల్పించారు. యువజన నాయకుడు మేకల సత్య తేజ ఆధ్వర్యంలో అనాథ, వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అనాథ పిల్లలకు మానసిక రుగ్మతలు కలిగిన చిన్నారులకు భోజన వసతి కల్పించారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగుల ఈకేవైసీకి ఆధార్ అనుసంధానం

కొయ్యలగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు ఈకేవైసీ, సీఎఫ్ఎంఎస్ఐడి నెంబర్‌కు ఆధార్ నెంబర్‌ను లింక్ ఆన్‌లైన్ చేసేందుకు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కె. నారాయణరావు తెలిపారు. ఒకరోజు మాత్రమే ఈ కార్యక్రమం ఉంటుందని, తదుపరి జంగారెడ్డిగూడెం సబ్ ట్రెజరీ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు.

పనిభద్రత కల్పించాలి

జంగారెడ్డిగూడెం : అంగన్‌వాడీ, ఆశ, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. మేడే వారోత్సవాల సందర్భంగా మంగళవారం ప్రభుత్వ టింబర్ డిపో వద్ద యడ్లపల్లి బోజ్జియ్య, పొగాకు బోర్డు వద్ద సత్యనారాయణ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ, రాష్ట్ర కమిటీ సభ్యులు సరియం రామ్మోహన్ మాట్లాడుతూ దేశంలో అసంఘటిత రంగ కార్మికులకు పని భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి చట్టబద్ధ సౌకర్యాలతో సమగ్ర చట్టం చేయాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా వాటిపై పోరాడేవారిని అక్రమ కేసుల్లో ఇరికించి బెయిల్ రాకుండా చేస్తున్నారని, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా సంఘాల నాయకులు తగరం నాగేశ్, చిడిపి బ్రహ్మయ్య, ప్రత్తిపాటి ఏసుపాదం, యండ్రపాటి సూరయ్య, మణెల్లి నాని, వసంతాటి వెంకటేష్, వాసు బోయిన శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యురాలి దర్శన వివాదం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో మంగళవారం రాత్రి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలి దర్శన వివాదం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం చినవెంకన్న ఆలయ ట్రస్టుబోర్డు సభ్యురాలు బోడపాటి మౌనిక కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం రాత్రి ఆలయానికి విచ్చేశారు. అదే సమయంలో శ్రీవారి చంద్రప్రభ వాహన సేవకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దాంతో దర్శనానికి కొద్దిసేపు వేచి ఉండాలని, స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయంలోంచి తీసుకొచ్చిన తరువాత వెళ్లాలని ట్రస్టు బోర్డు సభ్యురాలిని తీసుకొచ్చిన ప్రొటోకాల్ ఉద్యోగికి, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు సూచించారు. అయినా వారు ఆలయంలోకి వెళ్లడంతో ప్రొటోకాల్ ఉద్యోగిపై ఏఈఓ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే తనను దర్శనానికి తీసుకెళ్లిన ప్రొటోకాల్ ఉద్యోగిపై కేకలు వేయడం.. తనను అవమానించినట్లేనని భావించిన సదరు ట్రస్టుబోర్డు సభ్యురాలు తన ఐడీ కార్డును ప్రొటోకాల్ ఆఫీసులో పడవేసి, పదవికి రాజీనామా చేస్తానని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఆలయ చైర్మన్ ఎస్వీ.సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాధరావు విచారణ చేపట్టారు.

ప్రజా సంక్షేమమే జగన్ ధ్యేయం

- నందాపురంలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు
- ఆడమిల్లిలో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

బుట్టాయగూడెం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం నందాపురంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బాలరాజు ప్రజలకు వివరించారు. అదేవిధంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. గడచిన నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారని చెప్పారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలకు దేశంలోనే మంచిపేరు వచ్చిందని అన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా సచివాలయం తలుపు తడుతున్నారని చెప్పారు. వలంటీర్ల ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. జోరుగా వర్షం కురిసినప్పటికీ గడపగడపకు కార్యక్రమం హుషారుగా సాగింది. వర్షం వస్తున్నప్పటికీ ప్రతి ఇంటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్యే బాలరాజు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, ఉయికే బొజ్జి కోఆప్షన్ సభ్యులు షేక్ సయ్యద్ బాజీ, ఎంపీటీసీ గాలి దుర్గారావు, నాయకులు కొవ్వాసి నారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కామవరపుకోట : రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మంగళవారం ఆడమిల్లి గ్రామంలో 127వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని మహిళలు, యువకులు పూలమాలలతో ఆయనను సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చారన్నారు. దీంతో ఆయన రాష్ట్ర ప్రజలందరి మన్ననలను పొందుతున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరల సీఎంను చేసే దిశగా ఓటు వేయాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, ఆడమిల్లి గ్రామ సర్పంచ్ కేశవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, పండు జగదీష్, దేవరపల్లి రామ్మోహన్‌రావు, గుర్రాల రవికుమార్, షేక్ మీరా సాహెబ్, నాగల సీతారామయ్య, బాబురావు, బోట్ల లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పుడు వార్తలపై చర్యలు తీసుకుంటాం



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మేకల హనుమంతరావు

పోలవరం రూరల్ : పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డికి ఏ మాత్రం సంబంధం లేని రెండు క్రిమినల్ కేసులను ఉదహరిస్తూ ఆయన ప్రతిష్టకు భంగం వాటిల్లేలా తప్పుడు వార్తలు ప్రచురిండాన్ని రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మేకల హనుమంతరావు తీవ్రంగా ఖండించారు. మంగళవారం పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. 2021 స్థానిక ఎన్నికల్లో ఎంపీపీగా ఎన్నికైన వెంకటరెడ్డి నిబద్ధతతో, నిజాయితీతో మండలంలో ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ఆయన ప్రజాదరణ చూసి ఓర్వలేక ఆయనపై విషం కక్కుతూ పచ్చమీడియాలో తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నారని, దీనిని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. పచ్చపత్రికపై క్రిమినల్, సివిల్ చర్యలు తీసుకుంటామని, ఎంపీపీల సంఘం లీగల్ విభాగం ద్వారా పరువునష్టం దావా కూడా వేస్తామన్నారు. ఒక పరువు పత్రిక (ఆంధ్రజ్యోతి) ఉదహరించిన రెండు క్రిమినల్ కేసుల్లో వెంకటరెడ్డికి ఎటువంటి సంబంధం లేదని, వారి వద్ద ఎటువంటి ఆధారాలు ఉన్నా చర్చకు రావాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆంధ్రజ్యోతి దినపత్రికను దహనం చేశారు. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షురాలు, సీతానగరం ఎంపీపీ బుర్రాల జ్యోత్స్న, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, పోలవరం మండల ఉపాధ్యక్షులు మిడియం సింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి



ఇన్‌చార్జి పీఓ సత్యనారాయణకు వినతిప్రతం అందజేస్తున్న నిర్వాసితులు

బుట్టాయగూడెం : పోలవరం ప్రాజెక్టు పునరావాస గృహ నిర్మాణాలకు తరలివచ్చి నివాసం ఉంటున్న కాలనీవాసుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జీవీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కేఆర్ పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన ఆర్అండ్ఆర్ కాలనీ గ్రామాల కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను పీఓ అడిగి తెలుసుకున్నారు. నిర్వాసిత కాలనీలో చేతి పంపులు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు. డ్రెయినేజీలు, వీధి లైట్లు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అయితే తమ కాలనీల్లో మంచినీటి వాటర్ ట్యాంక్‌లు ఉన్నప్పటికీ కరెంట్ పోయిన సమయంలో ఉపయోగపడే విధంగా కాలనీల్లో చేతిపంపులు వేయించాలని కమిటీ సభ్యులు కోరారు. వేలేరుపాడు తహసీల్దార్ కె.చల్లన్నదొర, ఎంపీపీ వల్లా లక్ష్మి, నిర్వాసిత కాలనీల కమిటీ మెంబర్‌లు పాల్గొన్నారు.

బీ, సీ బ్లాక్‌లను 41.15 కాంటూరులో చేర్చాలి

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురవుతున్న కుక్కునూరు బీ, సీ బ్లాక్‌లను 41.15 కాంటూరు పరిధిలో చేర్చాలని కోరుతూ ఆయా బ్లాక్‌లోని నిర్వాసితులు మంగళవారం ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జీవీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మల్లెల చంటి నాయుడు, కోటేశ్వరరావు, వీరభద్రం మాట్లాడుతూ 2017లో జరిగిన ఆర్అండ్ఆర్ సర్వేలో సర్వే సౌలభ్యం కోసం కుక్కునూరు గ్రామాన్ని ఏ, బీ, సీ బ్లాక్‌ల కింద విభజించారని చెప్పారు. అయితే ప్రస్తుతం ఏ బ్లాక్ ఒకటే 41.15 పరిధిలో ముంపునకు గురవుతుందని బీ, సీ బ్లాక్‌లను 45 కాంటూరు పరిధిలో చేర్చారని చెప్పారు. ఈ ఏడాది వచ్చిన వరదల సమయంలో ఏ బ్లాక్ ముంపునకు గురవ్వకముందే బీ, సీ బ్లాక్‌లు ముంపునకు గురవుతున్నాయని, కావున బీ, సీ బ్లాక్‌లను కూడా 41.15 కాంటూరు పరిధిలో కలిపి తమకు పూర్తి న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో నిర్వాసితులు గిరి పుష్పవతి, గిరి భాస్కరరావు, నీలాల మనోజ్ పాల్గొన్నారు.

వైభవంగా సత్యదేవుని కల్యాణ ఉత్సవాలు





రంగాపురంలో అమ్మవార్లకు మంగళసూత్రాలు అందజేస్తున్న దృశ్యం, గవరవరంలో విశేషాలంకరణలో శ్రీరమా సత్యనారాయణ స్వామి

కొయ్యలగూడెం : గవరవరం గ్రామంలోని (వెంకయ్య పాలెం) శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి కల్యాణం, సత్యనారాయణ స్వామి వారి వ్రతం మంగళవారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా స్వామివారికి విశేష పూజలు, అభిషేక అర్చనాది కార్యక్రమాలు, హోమాలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు భక్త దంపతుల చేత పురోహితులు కల్యాణ కార్యక్రమం వ్రత కార్యక్రమం ఆచరింప చేశారు. మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన నిర్వహించి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

అమ్మవార్లకు మంగళసూత్రాలు అందజేత

లింగపాలెం : రాష్ట్రంలోనే రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన రంగాపురం గ్రామంలో వేంచేసిన శ్రీభూనీల సహిత శ్రీసత్యన్నారాయణస్వామి ఆలయంలో ఈనెల 4 వతేదీన బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు అమ్మవార్లు ఇద్దరికి రూ.2 లక్షల విలువ కలిగిన మంగళ సూత్రాలను మంగళవారం దాత యార్లగడ్డ కళ్యాణమ్మ బహూకరించారు. ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు, ఆలయ ప్రధానార్చకులు శేషాచార్యులు, గుమస్తాలు రాధిక, గోపి సమక్షంలో మంగళసూత్రాలు అందజేశారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

లింగపాలెం : రంగాపురం శ్రీసత్య కల్యాణ మండపంలో మంగళవారం ఏలూరు జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. జిల్లా అధ్యక్షుడిగా కొప్పాక వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కింగ్ రాజు, చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షుడిగా చిప్పాడ నరసింహరావు, ఉపాధ్యక్షుడిగా దాక్షవరపు వెంకట గంగాధరరావు, ప్రధాన కార్యదర్శిగా నందింగం సుబ్బారావు, జాయింట్ కార్యదర్శిగా చెడే ప్రసన్నకుమార్, కోశాధికారిగా కొక్కిరిపాటి సురేంద్ర, ప్రచార కార్యదర్శిగా కట్టుంగ సూరిబాబు, సహాయ ప్రచార కార్యదర్శిగా కొప్పాక నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాల గురుస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పెర్ల నాగరాజు, కార్యదర్శి కొప్పాక వీర వెంకట సత్యన్నారాయణ, బీసీ సంఘం జేఏసీ చైర్మన్ డాక్టర్ లంకా వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వర్ధనపల్లి కాశీ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తురాయి శ్రీనివాస్ అధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో బయ్యన్నగూడెం సర్పంచ్ లింగంశెట్టి అనంత లక్ష్మి, లింగంశెట్టి శ్రీనివాసరావు, రంగాపురం, ములగలంపాడు సర్పంచ్‌లు ముసునూరి రాము, ఇనుగంటి రాజేష్‌బాబు, నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



అయ్యప్ప క్షేత్రానికి విరాళం అందజేస్తున్న సత్యనారాయణ దంపతులు

జంగారెడ్డిగూడెం రూరల్ : అయ్యప్ప స్వామి జన్మన క్షత్రం ఉత్తరా నక్షత్రం పురస్కరించుకుని గురవాయిగూడెం అయ్యప్పస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గూడూరు వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీ, గణపతి హోమం జరిపారు. అన్నసమారాధనలో భక్తులు పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. జంగారెడ్డిగూడెంకు చెందిన కొప్పుల సత్యనారాయణ, శివనాగలక్ష్మి దంపతులు శాశ్వత అన్నదాన పథకానికి రూ: 1,01,116 విరాళాన్ని అందజేశారు. ప్రగడవరానికి చెందిన పరస శంకరరావు, రోజా రాణి దంపతులు రూ: 5 వేల నగదు అందజేశారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ కె.రామిరెడ్డి, డెవలప్‌మెంట్ చైర్మన్ చామర్తి శ్రీరాములు, తమ్మని వెంకటేశ్వరరావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు, గొంట్ల వెంకటేశ్వరరావు, గంగు జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



శ్రీనివాసపురంలో పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో విజయలక్ష్మి

జంగారెడ్డిగూడెం రూరల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ గ్రామాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేలా అధికారులు పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ఎ. విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం డీపీవో పర్యటించారు. శ్రీనివాసపురం, చక్రదేవరపల్లి, లక్కవరంలో పర్యటించి డంపింగ్ యార్డులను పరిశీలించారు. అమ్మపాలెంలో రజకులకు చెరువు కేటాయించాలంటూ స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై డీపీవో అమ్మపాలెం వెళ్లి పంచాయతీ సిబ్బందితో సమావేశమై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచేలా పంచాయతీ సిబ్బంది పనిచేయాలన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలతో పాటు, గ్రామాల్లో సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్‌లు సూరవరపు రాంబాబు, పోల్నాటి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డీఎల్‌పీవో ఎం. రాజు, ఈవోపీఆర్డీ సునీల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చేతికందే దశలో నీటిపాలు



చొప్పరామన్నగూడెంలో నీటిలో మునిగిన మొక్కజొన్న కండెల్ని సేకరిస్తున్న రైతు



పోలవరం వైద్యశాలకు వెళ్లే మార్గంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కొయ్యలగూడెం : కాని కాలంలో కురుస్తున్న వర్షాలు రైతులకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు మంగళవారం సాయంత్రం ఎడతెరిపి లేకుండా రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి రైతులు కుదేలయ్యారు. ముఖ్యంగా మొక్కజొన్న రైతుల పాలిట వర్షాలు అశనిపాతాన్ని మిగిల్చాయి. మండల వ్యాప్తంగా కురిసిన వర్షాలతో పంట చేతికి అందే దశలో ఉన్న మొక్కజొన్న కండెలు, అదేవిధంగా ఆరుబయట మొక్కజొన్న పంటను ఎండ కాపునకి పెట్టుకొనగా తడిచి ముద్దయ్యాయని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. చొప్ప రామన్నగూడెం గ్రామం సమీపంలోని భారీ వర్షానికి చేలో ఉన్న మొక్కజొన్న కండెలు రాలి పంట బోదిలో పడిపోయాయని దీంతో నీట మునిగిన బోదిలో ఉన్న పంటను వొబ్బిడి చేసుకునే ప్రయత్నంలో రైతు నల్లారి చినరాఘవులు తల మునకలై ఉన్నాడు. మంగపతి దేవి పేట, కన్నాపురం, రాజవరం, యర్రంపేట, బయ్యన్నగూడెం, దిప్పకాయలపాడు, బోడిగూడెం గ్రామాలలోని మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొన్నారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో పంటను జాగ్రత్త చేసుకునే మార్గం లేక రైతులు బెంబేలెత్తుతున్నారు. భారీ వర్షానికి కొయ్యలగూడెంలో రోడ్లు జలమయం అయ్యాయి. ముఖ్యంగా పోలవరం రోడ్డు ముంపునకి గురికాగా డ్రెయినేజీ నీరు పొంగి రోడ్డు పైకి ప్రవహించింది. పరింపూడి పంచాయతీ పరిధిలో డ్రెయినేజీల ఆక్రమణ వల్ల దిగువ ప్రాంతాల ప్రజలు తమ ఇల్లు మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు కన్నాపురం పడమటి కాలువ తూర్పు కాలువలు, నరసన్నపాలెం వద్ద బైనేరు కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

అకాల వర్షాలతో రైతుల ఇబ్బందులు

పోలవరం రూరల్ : అకాల వర్షాల ప్రభావంతో పోలవరం మండలంలోని రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి, మొక్కజొన్న పంటలను ఆరబెట్టినవి బరకాలు కప్పుకుని ఒబ్బిడి చేసుకుంటున్నారు. రెండు రోజులుగా భారీగా వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పలు పల్లప్రాంతాల్లో వర్షం నీరు కూడా నిలిచిపోతోంది. గాలి, వాన ప్రభావంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది.

జూనియర్ లైన్‌మెన్‌ల చేతివాటం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం టౌన్ పరిధిలోని లైన్‌మెన్‌ల చేతివాటం నానాటికి పెచ్చు మీరుతోంది. పైసలిస్తే గాని పనులు చేయమని నిర్మొహమాటంగా వినియోగదారులకు చెబుతుండడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కనెక్షన్లను ఇస్తూ సొమ్ములు దండుకుంటున్నారు. కొయ్యలగూడెం టౌన్ పరిధిలో ఒక లైన్‌మెన్ అతనికి సహాయకులుగా ముగ్గురు గ్రేడ్–2కు చెందిన జూనియర్ లైన్‌మెన్‌లు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో సహాయకులైన లైన్‌మెన్‌లు అశోక్ నగర్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా సర్వీస్ వైరును ఓ ఇంటి వినియోగదారునికి ఇవ్వడం జరిగింది. ఇదే సమయంలో కొత్త సర్వీసుకి కొత్తమీటర్‌ను అమర్చాల్సి ఉండగా వేరొక చోట ఉన్నటువంటి మీటర్ బదిలీ సంబంధించి అనుమతులు లేకుండా కొత్త ఇంటికి బిగించారు. ఈ విధంగా టౌన్ పరిధిలో పలుచోట్ల జూనియర్ లైన్‌మెన్‌లు అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది. ఎస్టిమేషన్ వేసి కొత్త విద్యుత్ పోల్స్ నిర్మించడానికి బదులుగా సర్వీసు వైర్లను పొడిగించి నూతన కలెక్షన్లు ఇస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని ఉన్నతాధికారులు విచారణ చేయాల్సిందిగా విద్యుత్ శాఖకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోండి

టి.నరసాపురం : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్ విధిగా తమ సీఎఫ్ఎంఎస్ ఐడీలను ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నంబర్‌తో అనుసంధానం చేయాల్సి ఉందని జిల్లా ఖజానాధికారి టి.కృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎఫ్ఎంఎస్ ఐడీ, హెచ్ఆర్‌బీ, పేరోల్ కు సంబంధించిన సేవలను పొందాలంటే ఈ అనుసంధానం అత్యవసరమన్నారు. ఖజానా, లెక్కల శాఖ సంచాలకుడి ఆదేశానుసారం ఈనెల 10వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉందని తెలిపారు. పెన్షనర్ల సౌలభ్యం కోసం ఆయా మండలాల్లో ఈకేవైసీ నమోదుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ఏలూరు జిల్లా పరిధిలోని చింతలపూడి ఉప ఖజానా కార్యాలయ ఎగువశ్రేణి గణాంకులు వి.వీర్రాజు, సిబ్బంది మండల పరిషత్ కార్యాలయం టీ.నరసాపురంలో అందుబాటులో ఉంటారన్నారు. కావున ఈ మండల పరిధిలో గల విశ్రాంత ఉద్యోగులు ఈ సేవలు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహాన్ని ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : తాడువాయి పంచాయతీ గొల్లగూడెంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇటీవల శిలాఫలకంపై పేర్ల విషయమైన తలెత్తిన వివాద నేపథ్యంలో గ్రామానికి చెందిన ఒకరు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన తెలిసిందే. విగ్రహ ధ్వంసానికి పాల్పడిన వ్యక్తిని అప్పట్లో పోలీసులు అరెస్ట్ చేశారు. జంగారెడ్డిగూడెం సీఐ బాలా సురేష్, ఎస్సై సాగర్ బాబు నూతన ఆంజనేయస్వామి విగ్రహాన్ని మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు. అర్చకులు మంత్రోచ్ఛరణతో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ భీమ శేఖర్, పోలీస్ సిబ్బంది. స్థానిక పెద్దలు సత్రం లక్ష్మణరావు, ఓరుగంటి నాగేంద్ర, చీదిరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బీసీ సీఎస్ఆర్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యడ్లపల్లి

ద్వారకాతిరుమల: ఏపీ బీసీ చైతన్య సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మండలంలోని గుణ్ణంపల్లికి చెందిన యడ్లపల్లి నటరాజును నియమించినట్టు ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ రమణ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించిన రమణకు నటరాజు కృతజ్ఞతలు తెలిపారు. సమితి అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

చింతంపల్లి గ్రామానికి ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణ

చింతలపూడి : ఎట్టకేలకు చింతలపూడి మండలం, చింతంపల్లి గ్రామానికి అధికారులు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ తాండ్ర రామకృష్ణ, గ్రామస్తులు ఎప్పటినుంచో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను కోరారు. గ్రామస్తుల విజ్ఞప్తిని పరిశీలించిన ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చింతంపల్లి గ్రామానికి ఉదయం, సాయంత్రం రెండు సర్వీసులను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం చింతంపల్లి గ్రామానికి వచ్చిన ఏలూరు డిపో బస్సును తహసీల్దార్ కృష్ణ జ్యోతి, సర్పంచ్ టి.రామకృష్ణారావు ప్రారంభించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొయ్యలగూడెం : విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు వెనుకాడబోమని డీఎల్‌డీవో ఎం.రాజు మంగళవారం పేర్కొన్నారు. పరింపూడి పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. కొన్ని సచివాలయాల పరిధిలో వలంటీర్లు నిర్లక్ష్యం కనబరిచారని, అటువంటివారిని తొలగించినట్లు చెప్పారు. సచివాలయం సిబ్బంది తమ బాధ్యతలను విస్మరిస్తున్నారని, కార్యాలయాలలో ఉండడం లేదనే విషయాలు తన దృష్టికి వచ్చాయని, అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి డుమ్మా కొట్టిన సచివాలయ సిబ్బందితో సహా వలంటీర్ల జాబితాను ఆయన రాసుకుని తగిన కారణాలు లేని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.